ప్రజాశక్తి
గురువారం 20 ఫిబ్రవరి 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

నాటుసారాను నిర్మూలిద్దాం

- 12 రకాల పరీక్షలు చేసిన తర్వాతనే షాపులకు మద్యం
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
- విద్యార్థుల భారీ ర్యాలీ, మానవ హారం
- నవోదయం 2.0 ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఇందు కోసమే 'నవోదయం-2.0' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కల్తీ మద్యాన్ని నిషేధించి పాత బ్రాండ్లను పునరుద్ధరించామని, మద్యం తయారీ పై ప్రత్యేక నిఘా పెట్టి 12 రకాల పరీక్షలు చేసిన తర్వాతనే షాపులకు తరలించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాటుసారా తయారీ, వినియోగాన్ని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నవోదయం – 2.0' రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని బుధవారం ఒంగోలు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ప్రారంభించిన ప్రతి కార్యక్రమం విజయవంతమవుతుందని ▶ 2లో

ఇసుక..దొరక్క!

- భవన నిర్మాణాలకు అందుబాటులో లేని వైనం
- జిల్లా వాసులకు ఇక్కట్లు
- అధికారం అండగా ఇసుక అక్రమ రవాణా
- అటకెక్కిన 'ఉచిత' హామీ
- జిల్లాలో కలగా మారిన ఇసుక స్టాక్ పాయింట్లు



ఉచిత ఇసుక అమ్మకాలు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా పరిధిలో ఎక్కడా కూడా అధికారిక ఇసుక క్వారీలు లేవు. కృష్ణా నది పరివాహక ప్రాంతమైన గాజుల్లంక వద్ద ఉన్న ఒకే ఒక్క ఇసుక రేవును కూడా ఈ నెల 6 నుంచి మూసివేశారు. దీంతో జిల్లా పరిధిలో ఎక్కడా కూడా అధికారిక ఇసుక రీచ్‌లు అనేవి లేకుండా పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చేసిన ఉచిత ఇసుక హామీ విధానం అమలులో భాగంగా పేరుకు ఇసుక రీచ్‌ను పెట్టినప్పటికీ దాని ద్వారా ఎప్పుడు కూడా సామాన్యులకు ఇసుక లభించిన దాఖలాలు లేవు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం అయితే ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తీసి జిల్లాలో పలు ప్రాంతాల్లో స్టాక్ పాయింట్లు పెట్టి అక్కడి నుంచి ఇసుకను సరఫరా చెయ్యాలి. కానీ గడచిన ఎనిమిది నెలల కాలంలో ఇదెక్కడా అమలుకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ హామీ మేరకు ఉచిత ఇసుక విధానంలో జిల్లాలో రెండు ఇసుక రేవుల నుంచి ఇసుక తవ్వకాలు జరిపి.. ప్రజలకు అందించాలని జిల్లా అధికారులు గతేడాది ఆగస్టులో నిర్ణయించారు. ఈ మేరకు కృష్ణానది పరివాహక ప్రాంతమైన జువ్వలపాలెం, గాజుల్లంక ఇసుక రేవుల వద్ద 1.50 లక్షల టన్నుల ఇసుక లభ్యత ఉన్నట్లు గుర్తించారు. ఒక్కొక్క రేవు నుంచి 74 వేల టన్నులకు పైగా ఇసుక లభిస్తుందని అంచనాలు వేశారు. ఈ తరువాత మరో మూడు ఇసుక రేవులను అందుబాటులోకి తేవాలని అప్పట్లో భావించారు. ఈ మేరకు జిల్లాలోని రేవుల నుంచి ఇసుక తవ్వడానికి టెండర్ల ద్వారా ఏజెన్సీలను పిలిచారు. తులసి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండర్ ద్వారా ఇసుక తవ్వకాల ఏజెన్సీని దక్కించుకుంది. టన్ను ఇసుకకు ప్రభుత్వానికి రూ.115 చెల్లించేలా సదరు సంస్థ టెండర్ వేసి ఏజెన్సీని దక్కించుకుంది. కానీ జిల్లాతో పాటు కృష్ణా నదికి ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. వరదలు రావడంతో జిల్లాలో ఇసుక తీయాల్సి ఉన్న జువ్వలపాలెం, గాజుల్లంక ఇసుక రేవులు నీటితో నిండిపోయాయి. దీంతో ఇసుక తీయడం కుదరలేదు. డిసెంబరు నెలలో గాజుల్లంక ఇసుక రేవు నుంచి కొద్ది రోజులు ఇసుక తీసినప్పటికీ అక్రమాలు చోటు చేసుకోవడంతో సదరు టెండర్ రద్దు చేసి మరొక సంస్థకు అప్పజెప్పారు. ఈ ఒక్క ఇసుక రేవును కూడా ఈ నెల 6 నుంచి మూసివేయడం జరిగింది. దీంతో జిల్లాలో ఎక్కడ కూడా ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ రంగం గడ్డు పరిస్థితిని ▶ 2లో

ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి

- ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి
- పేదలపై భారాలు.. సంపన్నులకు రాయితీలు..
- కేంద్ర బడ్జెట్‌పై వామపక్షాల కన్నెర్ర
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రజాసంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ల ప్రయోజనం కోసం రూపొందించిన కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. కార్పొరేట్లపై 2 శాతం, సంపన్నుల సంపదపై 2 శాతం పన్ను విధించాలని డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చి నిధులు పెంచుతూ బడ్జెట్ సవరణ చేయాన్నారు. బడ్జెట్ సవరణకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు.

కార్పొరేట్లకు సంపదను దోచిపెట్టేందుకు రూపొందించిన ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేందుకు దోహదపడే బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేస్తూ ఒంగోలు కలెక్టరేట్ ఎదుట వామపక్షాలు బుధవారం నాడు ధర్నా చేపట్టాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ వ్యవసాయం, ఉత్పత్తి రంగానికి, ఉపాధి రంగానికి ఎటువంటి ప్రాధాన్యతనీయకుండా అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లకు రాయితీలు అందించేలా బడ్జెట్ రూపొందించినట్లు విమర్శించారు. మధ్యతరగతి వర్గానికి రూ.12 లక్షల పన్ను రాయితీ కల్పించినట్లు రూపొందించిన బడ్జెట్‌లో మతలబు దాగివున్న అంశాన్ని మధ్యతరగతి గుర్తించాలన్నారు. మూడేళ్లుగా దేశంలో రైతాంగ ఉద్యమం కొనసాగుతున్నప్పటికీ 'రైతు మద్దతు ధర' గురించి ఎక్కడా ప్రస్తావన లేకపోవడం విచారకరమన్నారు. 46 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌ల అమలు ప్రస్తావన గావించడం కార్మికుల వ్యతిరేక చర్యగా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రకటించిన విశాఖ ఉక్కుకు రూ.14 వేల కోట్లు, అమరావతికి రూ.15 వేల కోట్ల అప్పుపై స్పష్టత లేదన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్రంపై ప్రశంసలు కురిపించడం సిగ్గుచేటన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి. కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్రం రూపొందించిన బడ్జెట్ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా 52 శాతం వ్యవసాయంపై ఆధారపడిన ఈ రంగాన్ని నిర్వీర్యం చేసేదిగా ఉందన్నారు. పొగాకు, మిర్చి, సుబాబుల్ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేదిగా లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తులపై గిట్టుబాటు ధర కల్పించేందుకు 'మద్దతు ధర చట్టం' చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడానికి 'మధ్య దళారీ వ్యవస్థ'గా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. కేంద్రం కీలకమైన విద్య, వైద్య రంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని, జిడిపిలో ఆరు శాతం విద్యకు, మూడు శాతం వైద్యానికి నిధులు కేటాయించాల్సి ఉండగా ▶ 2లో

ఆర్మీ జవాన్ మృతి

- ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీసులో మిస్ ఫైర్..
- నేడు సైనిక లాంఛనాలతో పి.వి.పాలెంలో అంత్యక్రియలు



వెంకట్ (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల

రాజస్థాన్‌లో ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీసు చేస్తుండగా మిస్ ఫైర్ జరగడంతో పిట్టలవానిపాలెం మండలం, గౌడపాలెంకు చెందిన ఆర్మీ జవాను పరిశా వెంకట్ (27) మృతి చెందారు. రాజస్థాన్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్ నుండి కుటుంబ సభ్యులకు బుధ వారం సమాచారం అంది నట్లు బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు తెలిపారు. పిట్టలవానిపాలెం, గౌడపాలెంకు చెందిన పరిశా శ్రీనివాసరావు, శివపార్వతి దంపతుల పెద్ద కుమారుడు వెంకట్ రాజస్థాన్ ఆర్మీ రెజిమెంట్‌లో సిపా యిగా పనిచేస్తున్నాడు. రాజస్థాన్ మిలిటరీ ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీసు చేస్తూ మిస్ ఫైర్ అయ్యి మరణించడం బాధాకరమని సాంబశివరావు తెలియజేశారు. వెంకట్ సోదరుడు గోపీకృష్ణ కూడా దేశ రక్షణ కోసం ఆర్మీలో పనిచేస్తు న్నాడు. అయితే దురదృష్టవశాత్తు ఫీల్డ్ ఫైరింగ్ ప్రాక్టీసులో జరిగిన దుర్ఘటనలో వెంకట్ మృత దేహాన్ని స్వగ్రామం చేర్చేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఆర్మీ అధికారులు తెలియజేశారు. మృతదేహాన్ని స్వగ్రామానికి చేర్చే విషయమై ఎప్పటికప్పుడు ఆర్మీ అధికారులతో మాట్లాడుతున్నట్లు సాంబశివరావు తెలిపారు. గురు వారం ఉదయానికి వెంకట్ మృత దేహం పిట్టలవానిపాలెంలో స్వగృహానికి చేరుకునే అవకాశాలు ఉన్నాయన్నారు. సైనిక లాంఛ నాలతో పిట్టలవానిపాలెం, గౌడ పాలెంలో అంత్యక్రియలు నిర్వ హించనున్నట్లు ఆర్మీ అధికారులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. వెంకట్‌కు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. వెంకట్ మతి పట్ల బాపట్ల అసోసియేషన్ ఉపా ధ్యక్షులు పుట్టా ఆదిశేషారెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, మాజీ సైనికులు తోట దుర్గారావు సంతాపం తెలిపారు.

ఎమ్మెల్యే నరేంద్రవర్మ పరామర్శ

చిన్న వయసులో ఆర్మీ జవాన్ వెంకట్ మృతిచెందడం బాధాకరమని ▶ 2లో

విద్యార్థులకు ఉత్తమ బోధనే లక్ష్యం : సిడిపిఒ

ప్రజాశక్తి- రేపల్లె

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడమే జ్ఞానజ్యోతి శిక్షణ ముఖ్య ఉద్దేశం అని సిడిపిఒ ఎం. సుచిత్ర తెలిపారు. అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం రెండో రోజూ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను అంగన్‌వాడీ దశ నుంచి అన్ని సంస్థలను ఒకే చోట ఉంచాలన్న సంకల్పంతో ఫౌండేషన్ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఒకే చోట నిర్వహించేలా చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండల పరిధిలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న 120 రోజుల జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సు రెండవ రోజు బుధవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా డిప్యూటీ డిఇఒ కె. సురేష్ కుమార్ మాట్లాడుతూ పిల్లల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అంశాలపై దష్టి సారించాలన్నారు. సున్నా నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదలపై చర్యలు చేపట్టాలన్నారు. చిన్నారుల ఎదుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు మరియు పౌష్టికాహారం వినియోగం, వారిలో గుర్తించవలసిన అంశాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మాచర్ల మోహన్ రావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సంపూర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



భట్టిప్రోలులో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ సురేష్ కుమార్

కొల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న 120 రోజుల జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సు శిక్షణ బుధవారం రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, విద్యాశాఖ అధికారులు పలు అంశాలపై అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. పిల్లల ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

కారంచేడు : మండల పరిధిలోని కుంకలమర్రు జడ్‌పి హైస్కూల్‌లో అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతిపై సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని రెండో రోజూ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌పిలు బాబురావు, రేణుక మాట్లాడుతూ పిల్లలు చదువు ఎలా నేర్చుకుంటారు. సమగ్ర అభివద్ధి ఎలా వస్తుంది, దాని ఫలితాలు ఎలా ఉంటాయి అనే అంశాల గురించి వివరించారు. ఆట, ఆధారిత అభ్యసన గురించి, అంగన్‌వాడీ పిల్లలు హాజరు పలకటం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పర్చూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రథమ్ సంస్థ సహాయ సహకారాలతో జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. అందులో భాగంగా చెరుకూరులో జిల్లా పరిషత్ హై స్కూల్‌లో పర్చూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణా కార్యక్రమం రెండో రోజు బుధవారమూ నిర్వహించారు. ఫ్రీ స్కూలు పిల్లలు విద్యను ఎలా నేర్చుకుంటారు అనే అంశం, విద్య నేర్చుకునేటప్పుడు పిల్లలో ఐదు రకాల అభివద్ధిని గురించి శిక్షకులు బ్రహ్మయ్య, బాల కోటేశ్వరరావు, రాధలు వివరించారు. శారీరిక, భాష, సజనాత్మకత, భావోద్వేగం, సాంఘిక అనే ఐదు అభివద్ధుల ద్వారా పిల్లలకు మెరుగైన విద్యను అందించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను సవరించాలి

(మొదటిపేజీ తరువాయి)

నామమాత్రపు కేటాయింపులు పట్ల ఆక్షేపణ వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య, వైద్యంతో పాటు వ్యవసాయ రంగానికి, జాతీయ ఉపాధి హామీ చట్టానికి అత్యధికంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత బడ్జెట్లో 90 ప్రాయోజిత పథకాలు రూపొందించగా, ఈ బడ్జెట్లో వాటిని 35కు కుదించడం వల్ల ఆయా రాష్ట్రాలపై భారం పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్రాల నుంచి 100 శాతం పన్నులు వసూలు చేసి కేవలం 30 శాతం మాత్రమే రాష్ట్రాలకు వాటాగా ఇవ్వడం అక్షేపనీయమన్నారు. రాష్ట్రంలో రూ.1.25 లక్షల కోట్ల ఆదాయ వనరులున్నప్పటికీ 30 ఏళ్ల క్రితం జిల్లాలో రూపొందించిన శ్రీకాళహస్తి రైల్వేలైన్ ఇప్పటికీ పూర్తి కాకపోవటం విచారకరమన్నారు. నిమ్జ్ పారిశ్రామిక అభివద్ధి పేరుతో 12 వేల ఎకరాలు సేకరించి 30 గదుల స్థలాల్లో ఫ్యాక్టరీల అభివద్ధి ఏ మేరకు సాధ్యమౌతుందని ప్రశ్నించారు. తాజాగా ఆయిల్ రిఫైనరీ, ఒంగోలు–దొనకొండ రైల్వే లైన్ అంశాలను తెరపైకి తీసుకొచ్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు దుయ్యబట్టారు. సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రూపకల్పన వెనుక అంతర్జాతీయ కార్పొరేట్ల హస్తం ఉన్నట్లు ఆరోపించారు. ఎలన్ మస్క్‌తో ప్రధానమంత్రి మోడీ మంతనాలు పలు అనుమానాలకు తావిస్తున్నట్లు ఆరోపించారు. సామాన్య ప్రజలపై కొట్లాది రూపాయలు పన్ను భారం విధించడం కంటే కార్పొరేట్లపై రెండు శాతం, సంపన్నుల సంపదపై రద్దు చేసిన పన్ను 2 శాతం విధించాలని డిమాండ్ చేశారు.. సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎంఎస్ సాయి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాసేదిగా ఉందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకంగా రూపొందిన బడ్జెట్ సవరణ చేసేటంతవరకు ఆందోళన కొనసాగించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా నాయకులు ఆర్ వెంకటరావు మాట్లాడుతూ పరిశ్రమరంగంలోని వ్యక్తులను కుబేరులుగా చేసేందుకు బడ్జెట్ రూపకల్పన చేసినట్లు ఉందని విమర్శించారు. సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సిపిఐ పట్టణ శ్రీరామ్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్, సిపిఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు కాలం సుబ్బారావు, కంకణాల రమాదేవి, వి బాలకోటయ్య, బి రఘురామ్, జి శ్రీనివాసులు, జి రమేష్, కేజి మస్తాన్, నెరుసుల వెంకటేశ్వర్లు, ఎస్ డి హుస్సేన్, తంబి శ్రీనివాసులు, ఉబ్బా ఆదిలక్ష్మి, జి ఆదిలక్ష్మి, టీ మహేష్, దామా శ్రీనివాసరావు, బివి రావు, మారెళ్ల సుబ్బారావు, కె వీరారెడ్డి, ఎస్‌డి సర్దార్, అక్కయ్య, రాజశేఖర్, పద్మ పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

బాపట్ల శాసనసభ్యులు వేగేన నరేంద్రవర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి పిట్టలవానిపాలెంలో వెంకట్ కుటుంబసభ్యు లను ఆయన పరామర్శించారు. వెంకట్ సోదరుడు కూడా సైన్యంలో పనిచేస్తున్నాడని, ఆ కుటుంబం దేశ సేవకు పునరంకితమై పనిచేస్తుందని తెలిపారు. మంచి భవిష్యత్తు ఉన్న వెంకట్‌ను కోల్పోవడం విచారకరమన్నారు. వెంకట్ మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

పాఠశాలలో తనిఖీ

ప్రజాశక్తి - కర్లపాలెం

విద్యార్థులకు మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం వడ్డించాలని కర్లపాలెం మండల విద్యాశాఖ అధికారి టియు.మనోరంజని తెలిపారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా స్థాయి తెలుసుకున్నారు. అనంతరం భోజన పథకాన్ని పరిశీలించి సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇనకొల్లు పోలీసు రావు, ఉపాధ్యాయులు ఇందుమతి, ప్రసన్న, విద్యార్థినీ, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక..దొరక్క!

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కోవడం జరిగింది. రాష్టంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో అప్పటికి అందుబాటులో ఉన్న 73 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను ఆరు స్టాక్ పాయింట్ల ద్వారా అమ్మకాలు జరిపారు. సదరు ఇసుక గత ఆగస్టు నెలలో అయిపోయింది. అప్పటి నుంచి జిల్లాలో ఎక్కడా ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణ రంగం ఇక్కట్లలో పడిపోయింది. ఇసుకతో పాటు సాధారణ అవసరాలకు ఉపయోగించే బుసక కూడా ఎక్కడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇసుక కావాలంటే పక్క జిల్లాలకు వెళ్ళి తెచ్చుకోవలసిన పరిస్థితులు తలెత్తాయి.ఇలా ఇసుక తెచ్చుకోవడం ప్రజలపై అధిక భారాన్ని మోపింది.

ఎన్నికల్లో ఉచిత ఇసుక హామీ ఇచ్చిన ప్రభుత్వం దాన్ని నెరవేర్చడంలో వైఫల్యం చెందింది. జిల్లాలో ఇసుక ఎక్కడా లభించని నేపథ్యంలో బాగా డిమాండ్ ఏర్పడింది. గతంలో అక్రమ ఇసుక తవ్వకాల్లో అనుభవం ఉన్న వారు అధికార పార్టీ అండగా ప్రభుత్వ భూములు, అటవీ భూములు, కాలువ గట్ల నుంచి ఇసుక అక్రమ తరలింపులకు పాల్పడుతూ వచ్చారు. ఇందుకోసం సముద్రతీరం ప్రాంతంలో ఉన్న అధికార పార్టీ నేతలకు లక్షల రూపాయల మేర చెల్లింపులు జరిపారన్న ఆరోపణలు వచ్చాయి. చీరాలలో అధికారపార్టీ నేతల మధ్య ఇసుక అక్రమ రవాణాలో నెలకొన్న ఆధిపత్య పోరులో జెసిబిని కూడా తగులబెట్టారు. సొంత అవసరాల కోసం టైరు బండ్లు, ట్రాక్టర్ల ద్వారా వాగులు, నదుల నుంచి ఇసుక తెచ్చుకోవచ్చని సిఎం చంద్రబాబు చెప్పారు. ఈ హామీని కూడా ఇసుక అక్రమార్కులు పక్కదారులు పట్టించారు. కాగా జిల్లాలో ఇసుక ఇబ్బందులు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇచ్చింది. సొంతంగా భూములున్నవారు ఎవరైనా ఇసుక తవ్వకాలకు దరఖాస్తులు చేసుకోవచ్చు. అయితే అధికారపార్టీ నేతలకే కప్పం కడుతున్న అక్రమార్కులకు అలాంటి అవసరం రాలేదు. ప్రభుత్వ భూములు, వాగుల నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కృష్ణా నదిలోని గాజుల్లంక, ఓలేరు ఇసుక రేవుల నుంచి ఇసుక తవ్వకాలకు అనుమతులు రావలసి ఉంది. ఇలా అనుమతులు వచ్చిన తరువాత అయినా జిల్లాలో పలుచోట్ల స్టాక్ పాయింట్లు పెట్టి ఇసుక అందరికీ అందుబాటులో వుండే చర్యలు చేపట్టాల్సి ఉంది.

నాటుసారాను నిర్మూలిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. దీంతో ఈ కార్యక్రమాన్ని ఒంగోలులో ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. గతంలో 2016లో నవోదయం కార్యక్రమంతో దాదాపు 10 జిల్లాల్లో నాటు సారాను నిర్మూలించి నాటుసారా రహిత రాష్ట్రంగా చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్, నాటుసారా విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా, ఎక్కడ అమ్మకాలు జరుగుతున్నా టోల్ ఫ్రీ నెంబర్ 14405, 1972 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. నీటి వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవడం ద్వారా రాష్ట్రాన్ని సశ్యశ్యామలం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పెట్టుబడులను ఆహ్వానించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పడుతున్న శ్రమను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. నాటుసారా, డ్రగ్స్, మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.100 కోట్లను కేటాయించినట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. యువత నిర్వీర్యం కాకూడదనే ఆలోచనతోనే ప్రభుత్వం ఇన్ని చర్యలు చేపట్టిందని, ఎక్సైజ్ అధికారులు ఇదే స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంతంలోని మారుమూల గిరిజన ప్రాంతాలలో నాటుసారా తయారీని పూర్తిస్థాయిలో నిర్మూలించడంపై ప్రభుత్వం దష్టి సాధించిందన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, నాటు సారా వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలన్నారు. టిడిపి దర్శి నియోజక వర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధతోనే ప్రభుత్వం నాటుసారా, ఇతర డ్రగ్స్ ను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నాటు సారా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్‌పి ఏ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌ను వారి దరి చేరనియ్యరాదని, ఒకసారి డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందలేరని తెలిపారు. రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ నవోదయం కార్యక్రమం ప్రాధాన్యతలను, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిం చారు. నాటు సారా, డ్రగ్స్, గంజాయి వినియోగించడం వలన కలిగే దుష్ప్రభావాలను తెలియజేస్తూ సమాజంలో చైతన్యం నింపేలా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు.

. విద్యార్థులలో భారీ ర్యాలీ, మానవహారం

నవోదయం 2.0 కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని మంత్రి కొల్లు రవీంద్ర జెండా ఊపి ప్రారంభించారు. నాటుసారా, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు ఆకాంక్షగా పావురాలను, బెలూన్‌లను మంత్రులు, ఉన్నతాధికారులు గాలిలోకి ఎగురవేశారు. అనంతరం ఎస్‌పి కార్యాలయం నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఒంగోలు బస్టాండ్ సెంటర్లో మానవహారం ప్రదర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహియుద్దీన్, ఆర్‌డిఒ .లక్ష్మి ప్రసన్న, మైనింగ్ డిడి టి.రాజశేఖర్ పాల్గొన్నారు.



మురుగుకాలువలో ఎబేట్ చల్లిస్తున్న దృశ్యం

గుర్రప్పడియలో పారిశుధ్య చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని గుర్రప్పడియ పంచాయతీలో పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని 'పడకేసిన పారిశుధ్యం' అనే శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైనది. ఈ వార్తకు స్పందించిన పంచాయతీ సిబ్బంది గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలోని మురికి కాలువల్లో బ్లీచింగ్ చల్లించి, కాలువల్లో నిలిచిపోయిన మురికి నీరు బయటకు వెళ్లగొట్టారు. ఎబేట్ స్ప్రేను చల్లించడంలాంటి కార్యక్రమాలు కార్యదర్శి చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నూతనంగా నిర్మిస్తున్న భవనం స్లాబ్‌కు రాడ్ బెండింగ్ చేస్తున్న కార్మికులకు విద్యుత్ షాక్ తగలడంతో గాయాలయ్యాయి. అందిన వివరాలు ప్రకారం నిర్మాణంలో ఉన్న రెండు అంతస్తు భవనానికి కింది నుంచి ఇనుప చువ్వలు అందిస్తున్న సందర్భంలో విద్యుత్ తీగల తగలడంతో కార్మికులు షాక్‌కు గురయ్యారు. తోటి కార్మికులు అప్రమత్తమై విద్యుత్ తీగలను కర్రతో కొట్టడంతో ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం ఒంగోలు తరలించారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-కొండపి

అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని తాటాకులపాలెంలో జరిగింది. మంగళవారం అక్రమం గా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో తాటాకులపాలెం గ్రామ శివారులో వాహన తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాలు రేషన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఎటువంటి పర్మిషన్ లేకపోవడంతో వెంటనే వాహనంలో ఉన్న వట్టికొండ బంగారయ్య, గరికతోటి అశోక్‌లను అదుపులోకి తీసుకొని వాహనాన్ని, అందులో ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చిన్నారులకు టీకాలు వేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు టీకాలు వేయాలని, మెరుగైన వైద్యం అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఓ) డాక్టర్ పద్మజ వైద్య సిబ్బందికి సూచించారు. బుధవారం యర్రగొండపాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. వైద్యశాలకు వచ్చిన రోగులతో సేవలపై ఆరా తీశారు. టీకాలు వేయడం పూర్తిన వెంటనే నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం లో పిల్లల బరువు, ఎదుగుదల నమోదు రికార్డులు పరిశీలించారు. పిల్లలు పౌష్టికాహారం సరిగా తీసుకునేలా చూడాలన్నారు. అనంతరం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి నెలా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ అనారోగ్య లక్షణాలున్నవారిని గుర్తించి తగు చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ వి.కోట నాయక్, స్టాఫ్ నర్స్ శ్రీలక్ష్మి, వైద్య సిబ్బంది పి.రవి బాబు, చిన్నయ్య, నల్లటి వెంకటరామయ్య నాయుడు పాల్గొన్నారు.

చెరువులో దూకి.. చిన్నారితో సహా తల్లి ఆత్మహత్య

ప్రజాశక్తి-సంతనూతలపాడు

8 నెలల చిన్నారితో చెరువులో దూకి తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం సంతనూతలపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంతనూతలపాడుకు చెందిన బాపట్ల వెంకట సుజాత (25) గత కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగా లేక ఇబ్బందులు పడుతోంది. మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చింది. మంగళవారం రాత్రికి కూడా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. అయినా ఆమె ఆచూకీ తెలియలేదు. బుధవారం ఉదయం చెరువు కట్టకు బహిర్భూమికి వెళ్లిన స్థానికులు చెరువులో పాప శవం తేలియాడటం గమనించి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అజయ్ బాబు ఆధ్వర్యంలో పడవ ద్వారా గాలించి వెంకట సుజాత మృతదేహాన్ని బయటకు తీశారు. వీఆర్వో వెంకటస్వామి, తహశీల్దార్ వి.ఆదిలక్ష్మి పంచనామా నిర్వహించగా ఎస్ఐ వి.అజయ్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆమె ఆమె మానసికి ఒత్తిడితో ప్రతి చిన్న విషయానికి ఇంట్లో గొడవలు పడుతూ ఉండేదని మృతురాలి భర్త బాపట్ల వెంకటేష్, తండ్రి ఏటి లక్ష్మయ్య తెలిపారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ అజయ్ బాబు



మాట్లాడుతున్న ఎంపిడిఓ సురేష్ బాబు

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపిడిఓ డి.సురేష్ బాబు అన్నారు. స్థానిక జెడ్పి హై స్కూల్లో నిర్వహిస్తున్న అంగన్వాడీ టీచర్ల 2వ రోజు శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఎంపిడిఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులందరూ ఇష్టంతో బడికి వచ్చే అలవాటును పెంపొందించాలన్నారు. 3 నుంచి 8 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన విద్యార్థులలో గ్రహణ శక్తి ఎక్కువగా ఉంటుందని, వారికి అక్షరాలు, అంకెలు పరిచయం చేయాలని సూచించారు. ఆట, పాట, మాటల ద్వారా బోధన చేస్తూ విద్యార్థులలో వివిధ అంశాల పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి-2 డి.వెంకటరెడ్డి, కోర్స్ కోఆర్డినేటర్ ఎం.ప్రమోద, అంగన్వాడీ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, పార్వతీ బాయ్, రిసోర్స్ పర్సన్స్ శేషుకుమారి, విజయలక్ష్మి, మౌలాఖాన్, సిఆర్‌ఎంటిలు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రస్ట్ మిత్రబృందం ఎన్ఆర్ఐ బెజవాడ శ్రీనివాసరావు, పద్మజలు విచ్చేశారు. ఈ సందర్భంగా కేకును కట్ చేశారు. సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ పాతూరి సంపత్, ట్రస్ట్ చైర్మన్ శనగల వెంకటరమణ పర్యవేక్షణలో ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశ విదేశాల నుంచి దాతల సహకారంతో గత 40 వారాల నుంచి ఒక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, ట్రస్టు గౌరవ అధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న స్కూల్ బస్సు

ఏడుగురికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - చీరాల

వ్యవసాయ కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను స్కూల్ బస్సు ఢీకొనడంతో కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన కారంచేడు మండలం జరుబులవారిపాలెం వద్ద బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. పర్చూరుకు చెందిన వ్యవసాయ కూలీలు కేశవరపాడుకు వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం ఆటోలో ప్రయాణిస్తుండగా ప్రైవేట్ స్కూల్ బస్ ఢీకొనడంతో ఆటో ఒక్కసారిగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు వ్యవసాయ కూలీలతో పాటు డ్రైవర్‌కు కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా వారిని చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న కారంచేడు ఎస్ఐ వెంకట్రావు వెంటనే చీరాల ఏరియా వైద్యశాలకు చేరుకొని క్షతగాత్రుల నుంచి వివరాలు సేకరించారు.

స్పృహ తప్పి పడిపోయిన గుర్తుతెలియని మహిళ

ప్రజాశక్తి-మద్దిపాడు

గుర్తుతెలియని మహిళ స్పృహతప్పి పడిపోయింది. ఈ ఘటన మండల పరిధిలోని మల్లవరంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని మహిళ మల్లవరంలో ఆలయం వద్దకు వచ్చి సత్రంలో భోజనం చేసింది. సుమారు నాలుగు గంటల ప్రాంతంలో మల్లవరం గ్రామంలోకి వెళ్తూ స్పృహ తప్పి కింద పడిపోయింది. ఆమె దగ్గర ఉన్న సంచిలో పాత దుస్తులు ఉన్నాయి. ఆచూకీ తెలిసినవారు మద్దిపాడు పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఎస్ఐ శివరామయ్య తెలిపారు. వివరాలకు 9121102133 నెంబరులో సంప్రదించాలన్నారు.



మంత్రులకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కేసులు ఎత్తివేయాలని మంత్రులకు వినతి

ప్రజాశక్తి- వేమూరు

సిపిఎస్ ఉద్యోగులపై ఉన్న కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ సంఘం ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీ మోహన్ సారధ్యంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ , రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథికి బుధవారం వినతి పత్రం అందజేశారు. కొల్లూరుకు విచ్చేసిన మంత్రులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాత పెన్షను విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యమం చేపట్టిన సందర్భంగా సిపిఎస్ ఉద్యోగులను నిర్బంధంగా అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు అసెంబ్లీలో సిపిఎస్ ఉద్యోగులపై ఉన్న కేసులు వెత్తివేస్తామని ప్రకటించినట్లు తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులపై ఉన్న కేసులను ఎత్తివేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్టేట్ బాబు, మనోజ్, శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



బోర్డు ఏర్పాటు చేస్తున్న అంగన్‌వాడీలు

అవగాహన హోర్డింగ్ ఏర్పాటు

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగులూరు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన అవగాహన హోర్డింగ్‌ను ఐసిడిఎస్ అధికారులు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ బోర్డుపై బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, చైల్డ్ హెల్ప్ లైన్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలను పొందుపరిచారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు ఇలాంటి హోర్డింగ్‌లు సంతమాగులూరు, బల్లికురవ మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ఏర్పాటు చేసినట్లు సిడిపిఒ డి సుధ తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకుడు నక్కల ఆంజనేయులు మృతి

ప్రజాశక్తి -వేటపాలెం



ఆంజనేయులు (ఫైల్)

వేటపాలెం మండలం పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నక్కల ఆంజనేయులు (99) వయో భారంతో బుధవారం మృతిచెందారు. ఆంజనేయులుకు ముగ్గురు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన కుమారుడు నక్కల అర్జున్‌రావు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులు, మరో కుమారుడు వెంకట రమణారావు విశ్రాంత పంచాయతీ రాజ్ ఇఇ. ఆంజనేయులు మృతదేహాన్ని పలువురు పముఖులు సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపీ చిమట సాంబు , మాజీ ఎమ్మెల్యే ఆమంచి కష్ణమోహన్, యాదవ సంఘం చీరాల నియోజకవర్గ అధ్యక్షుడు గవిని వెంకటరావు తదితరులు ఉన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

ప్రజాశక్తి -వేటపాలెం



వేటపాలెంలో మాట్లాడుతున్న లలితా పరమేశ్వరరెడ్డి



చెరుకుపల్లిలో మాట్లాడుతున్న విద్యార్థిని

మండల పరిధిలోని పందిళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో హిందీ భాషా ఉత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు శంఖం లలితా పరమేశ్వరి, బుద్ధి ప్రసన్నాంజనేయులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, గేయాలు, కవితలు, దోహాలు చక్కని అభినయం తో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. 6వ ,9 వ తరగతి విద్యార్థులు యామిని, కోమలి, ఊహశ్రీ, శాంత కుమారి, జస్మిత, షణ్ముఖేశ్వర్ హిందీలో దేశభక్తి, జాతీయ సమైక్యత, హిందీ భాష యొక్క గొప్పతనం గురించి అభినయం ద్వారా గీతాలు ఆపలించారు. తొమ్మిదవ తరగతి విద్యార్థినులు తేజస్విని, బాంధవ్య, బిందు శ్రీలత మన దేశ అధికార హిందీ భాష యొక్క గొప్పతనాన్ని గురించి గేయాల , కవితల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మెడబలిమి శేఖరరావు మాట్లాడుతూ పిల్లలకు తరగతి గదులలో బోధన అభ్యసన ప్రక్రియలు చేపట్టడంతో పాటు, అప్పుడప్పుడు స్వేచ్ఛాయుత వాతావరణంలో వారందరినీ ఒకే చోట సమావేశపరిచి పండుగ వాతావరణాన్ని కల్పించాలన్నారు. దీంతో విద్యార్థులు ఉత్సాహంతో, ఒకరితో మరొకరు పోటీ పడుతూ తమలో దాగి ఉన్న వివిధ రకాల అంతర్గత శక్తులు, నైపుణ్యాలు వెలికితీయటానికి, వారి సమగ్ర మూర్తిమత్వ వికాసానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. హిందీ పాధ్యాయురాలు శంఖం లలితా పరమేశ్వరి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరినీ ఏకం చేయడానికి ఎంతగానో హిందీ భాష దోహదపడినట్లు తెలిపారు. ప్రధానంగా దక్షిణ భారత దేశ ప్రజలు ఉన్నత చదువులకు, ఉద్యోగ నిర్వహణ కోసం దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చినప్పుడు, పిల్లలందరూ హిందీ భాష పై పట్టు సాధించినట్లయితే, జీవితంలో స్థిరపడటంతో పాటు, భాషా భేదాలు తగ్గి, జాతీయ సమైక్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు, ఆంగ్ల, గణిత, సైన్సు, సోషల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : ప్రతి ఒక్కరూ హిందీ భాష నేర్చుకోవాలని, దేశ అధికార భాష హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలో ఎక్కడికైనా వెళ్లి మనుగడ సాగించ వచ్చునని గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.కవిత తెలిపారు. ఫిబ్రవరి 19 హిందీ భాషా దినోత్సవం సందర్భంగా గుల్లపల్లి హైస్కూల్లో విర్థులకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వివిధ అంశాలలో పోటీలు, కథలు, బాల గేయాలు, పద్యాలు, బోధనోపకరాల ప్రదర్శన, పాటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వి.శ్రీను, ఉపాధ్యాయులు ఎ.మాధవి, టి.అనుపమ తదితరులు పాల్గొన్నారు.

'ఆఫీసర్స్ క్లబ్'లో విచారణ

ప్రజాశక్తి-బాపట్ల



విచారణ నిర్వహిస్తున్న ఆర్‌డిఒ గ్లోరియా

బాపట్ల ఆఫీసర్స్ క్లబ్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి విచారణకు ఆదేశించారు. అందులో అధికారులు ఆగమేఘాలపై రంగంలోకి దిగి బుధవారం విచారణ చేపట్టారు. ఆఫీసర్స్ క్లబ్‌ను నిర్వహిస్తున్న మరియదాసు, వెంకయ్య చౌదరిని అధికారులు విచారించారు. రమ్మీ ఆటకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆఫీసర్స్ క్లబ్‌కు కమిటీ ఎప్పుడు ఏర్పాటైంది. ప్రస్తుతం ఉన్న కమిటీ ఎప్పటి నుంచి కొనసాగుతోంది. ఎప్పటి వరకూ కొనసాగాలి అనే వివరాలు, పలు రికార్డులను తనిఖీలు చేస్తున్నారు. క్లబ్ సభ్యత్వం ద్వారా వచ్చే ఆర్థిక వివరాలు వాటి జమ ఖర్చులు, క్లబ్‌కు విచ్చేసే వారి నుంచి సభ్యత్వం ద్వారా రాబడితో సమకూరుతున్న ఆర్థిక వనరులు తదితర వివరాలను సేకరించారు. అందుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. ఆఫీసర్స్ క్లబ్ నిర్వాహకులపై జిల్లా కలెక్టర్ మండిపడటంతో అధికారులు బుధవారం సాయంత్రం నుండే ఆఫీసర్స్ క్లబ్ కి సంబంధించి న వివరాలను సేకరణ విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. ఆఫీసర్స్ క్లబ్ లో ఏఏ క్రీడలు ఆడతారు. ఇక్కడ జరుగుతున్న కార్యకలాపాలపై పోలీసు అధికారులు సైతం సమాచారాన్ని రాబడుతున్నారు. పురపాలక సంఘం పరిధిలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్ కి సంబంధించి మున్సిపల్ పన్నులు చెల్లిస్తున్నారా లేదా అనే వివరాల రికార్డులు, మున్సిపల్ రసీదులు పరిశీలిస్తున్నారు. గతంలోఈ క్లబ్ పై ఏమైనా పోలీస్ దాడులు జరిగాయా అనే అంశాన్ని పరిగణలో తీసుకొని ఆ దిశగా విచారణ జరుగుతోంది. విచారణ సందర్భంగా ఆఫీసర్స్ క్లబ్ భవనం లోపల అన్ని గదులను, అక్కడ ఉన్న ఖాళీ స్థలాన్ని విచారణ అధికారులు పరిశీలించారు. విచారణ పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని విచారణ అధికారి బాపట్ల ఆర్‌డిఒ గ్లోరియా తెలిపారు. విచారణలో ఆర్‌డిఒ గ్లోరియా తహశీల్దారు షేక్ సలీమా, మున్సిపల్ కమిషనర్ జి. రఘునాథరెడ్డి, బాపట్ల సర్కిల్ సిఐ హరికష్ణ , పట్టణ సిఐ రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్ నిర్మాణం ఎప్పుడో..?

ప్రజాశకి-భట్టిప్రోలు



ప్రమాదభరితంగా ఉన్న రోడ్డు మార్జిన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధ్వానంగా ఉన్న రహదారులను సిసి రోడ్లుగా నిర్మించారు. రోడ్డు మార్జిన్‌ను అలాగే వదిలేశారు. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు హడలిపోతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వాహనాలు వచ్చిన నప్పుడు తప్పుకునేందుకు అవకాశం లేక వాహన చోదకులు అనేక అవస్థలు పడుతున్నారు. ఏమాత్రం ఆదమర్చినా వాహనాలు రోడ్డుపై నుంచి జారిపడి ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉంది. మండల పరిధిలోనిఐలవరం గ్రామ ప్రధాన రహదారిని రూ.50 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డుగా నిర్మించారు. రోడ్డు మార్జిన్ కోసం రూ.10 లక్షలు కేటాయించారు. గుత్తేదారు రహదారి మూడు నెలలపాటు నిర్మించాడు. పనులు పూర్తి అయి నెల రోజులు దాటింది. రోడ్డు మార్జిన్ నిర్మించకపోవడంతో వాహనదారులు ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. గ్రామానికి ఆర్‌టిసి బస్సులు, పాఠశాల బస్సులు, ఆటోలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో సైడ్ ఇచ్చేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. సైడ్ ఇచ్చే క్రమంలో ఎక్కడ ప్రమాదానికి గురికావాల్సి వస్తుందని వాహనచోదులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్ ఏర్పాటు చేయించి ఇక్కట్ల నుంచి కాపాడాలని ప్రయాణికులు,వాహన చోదకులు కోరుతున్నారు.



కార్యదర్శిని సన్మానిస్తున్న డిపిఒ ప్రభాకర్‌రావు

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి- అమృతలూరు

మండల పరిధిలోని కూచిపూడి గ్రామపంచాయతీలో జనవరిలోనే నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయడం అభినందనీయమని డిపిఒ ప్రభాకర్ రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూరు శాతం వసూలు చేసిన పంచాయతీ కార్యదర్శి బి.తిరుమలరావును బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ కూచిపూడి పంచాయతీ కార్యదర్శిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల నరేంద్రబాబు, డిఎల్‌పిఒ శ్రీనివాసన్, ఎంపిడిఒ మారుతి శేషమాంబ, ఇఒపిఆర్‌డి మాకినేని రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రద్దీ సమయాల్లో చెత్త తరలింపు

ట్రాఫిక్‌కు ఇబ్బందులు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో చెత్త తరలింపు ఇష్టారీతిన సాగుతోంది. రాత్రి, వేకువజామున చేయాల్సిన చెత్త తరలింపు పనులను ఉదయం అందరూ ఆఫీసులకు, పనులకు వెళ్లే సమయంలో చేస్తున్నారు. నగరంలో కర్నూల్ రోడ్డు, ట్రంక్ రోడ్డు, మంగమూరు రోడ్డు, గుంటూరు రోడ్డు వంటి ప్రధానమైన రోడ్డు నిత్యం రద్దీగా ఉంటాయి. నగరంలో ట్రాఫిక్, ప్రజా అవసరాలకు సంబంధించి ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పారిశుధ్య పనులు అనగా రహదారులు శుభ్రం చేయడం, చెత్త సేకరణ వంటి పనులు రాత్రి వేళలు, తెల్లవారుజామున నిర్వహించవలసి ఉంది. డ్రైనేజీ మరమ్మతులు, డ్రైనేజీ కట్టడాలకు అవసరమైన సిమెంటు, కంకర, ఇసుక వంటి మెటీరియల్ తోలకం కూడా రాత్రివేళ లేక వేకువజామున వేళల్లో మాత్రమే నిర్వహించాలి. ప్రధాన వీధుల్లో వాహనాల ద్వారా చెత్త సేకరణ ప్రక్రియ 2, 3 రోజులుగా రద్దీ సమయాల్లో కొనసాగించడం వల్ల పౌర సేవలకు, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా కర్నూలురోడ్డులో సైడ్ కాలువల అభివృద్ధి పనులు నిర్వహిస్తుండటం వల్ల కొంత ట్రాఫిక్‌కు అంతరాయం కాగా, మరో వైపు అదే రహదారుల్లో భారీ వాహనాలతో చెత్త సేకరణ ప్రక్రియ మరింత ట్రాఫిక్‌ను పెంచేదిగా మారింది. వాహనాల మరమ్మతుల వల్ల పగలు చెత్త సేకరిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. గోపికృష్ణ థియేటర్ వెనుక, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదుట, కర్నూల్‌రోడ్డులో పగటి పూటే భారీ వాహనాల సరుకుల లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియ కొనసాగటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయంలో కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కర్నూల్‌రోడ్డులో రమ్య ఫాస్ట్‌ఫుడ్ ఎదురుగా చెత్తను సేకరిస్తున్న వాహనం

వీఆర్‌ఒల అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ 2025 డైరీని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా బుధవారం ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వీఆర్ఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వైపి రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె ఆదిరెడ్డి, కోశాధికారి కె. జనయ్య, రాష్ట్ర నాయకులు రవికుమార్, జిల్లా నాయకులు ఏ.వెంకట్రామయ్య, నాసరవలీ, ఒంగోలు మండల అధ్యక్షులు ఎస్‌కె యజ్ఞానీ, ఎం.సురేష్, జి.వెంకటరెడ్డి, బి.మహేంద్రారెడ్డి, ఎన్.సాయి కుమార్ పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ఎపిఈడబ్ల్యుజెయు జిల్లా అధ్యక్షులుగా అశోక్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్, జర్నలిస్ట్ యూనియన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా షణ్ముఖ వెలుగు ఫొటోగ్రాఫర్ ఉబ్బా అశోక్ ఎన్నికయ్యారు. ఒంగోలు మీడియా కెమెరామెన్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రకాశం జిల్లా శాఖకు కొత్త అధ్యక్షుని ఎన్నిక జరిగింది. అశోక్ బాబును యూనియన్ నేతలు ఘనంగా సత్కరించారు.

ప్రకృతి వ్యవసాయం ప్రయోజనకరం..

ఏపిసిఎన్ఎఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిణి

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

పర్యావరణంలో వచ్చిన మార్పులకనుగుణంగా రైతులు 'ప్రకృతి వ్యవసాయం' చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.సుభాషిణి పేర్కొన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధి కారణంగా, వ్యవసాయంలో వచ్చిన పెను మార్పులకనుగుణంగా రైతులు పంటల దిగుబడుల కోసం అధికంగా రసాయన ఎరువులు, పీడపీడకలు పురుగు మందుల వాడుతున్నారన్నారు. ఈ కారణంగా భూసార లోపం ఏర్పడుతుందని తెలిపారు. అటువంటి నేలలో పండిన పంటల్లో పోషకాలు ఉండవన్నారు. ఆహారధాన్యాలు, కాయగూరల్లో తగినన్ని పోషకాలు లేని కారణంగా ఆహార సమతుల్యత లోపిస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రకృతి సిద్ధమైన, పర్యావరణ అనుకూలమైన పద్ధతుల్లో సాగు చేయొచ్చన్నారు. సేంద్రీయ వ్యవసాయం పెట్టుబడి లేని వ్యవసాయంగా పేర్కొన్నారు. 'సేంద్రీయ వ్యవసాయం' ఖర్చుతో కూడినదిగా రైతుల్లో అపోహలున్నాయని, అది వాస్తవం కాదన్నారు. ప్రకృతిలో లభించే పశువుల ఎరువు, ఆకులు, అలములు వ్యర్థాలతో సేంద్రీయ ఎరువు తయారుచేసుకోవడం, వాటిని వినియోగించుకోవటం ద్వారా అధిక దిగుబడులు సాధించొచ్చన్నారు. గోమూత్రం, వేప కషాయంతో క్రిమిసంహారిక ద్రావణంలా వినియోగించుకొని తెగుళ్లను నివారించొచ్చన్నారు. 3, 4 సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా ఈ సాగు పద్ధతి అమలు చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పంట మార్పిడి పద్ధతి అమలు చేపడితే మంచి ఫలితాలు సాధించొచ్చన్నారు. తొలుత 17 ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేపట్టామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 38 మండలాల్లో 187 పంచాయతీల్లో ఈ వ్యవసాయం కొనసాగుతోందన్నారు. ప్రారంభంలో 3 వేల మంది రైతులతో చేపట్టిన వ్యవసాయం ప్రస్తుతం 50 వేల మందితో కొనసాగుతుందని తెలిపారు. రాబోయే కాలంలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో అమలుకు కృషి చేస్తున్నామన్నారు. దీనికి అవసరమైన సాంకేతిక సలహాలు అందిస్తామన్నారు.



సుభాషిణి

పక్కాగృహాల నిర్మాణాలలో లక్ష్యాలను చేరుకోవాలి

సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పక్కాగృహాల నిర్మాణాలలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. గృహ నిర్మాణాలపై సంబంధిత శాఖ అధికారులతో బుధవారం ఆయన స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. మొదటి త్రైమాసంలో బాపట్ల జిల్లాకు 4,898 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యం అన్నారు. ప్రస్తుతం 290 మాత్రమే పూర్తి చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. మిగిలినవన్నీ మార్చిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గృహ నిర్మాణాలలో పని దినాలు కల్పించాలన్నారు. నిర్దేశించిన మాదిరిగా 90 పని దినాలు చూపి లబ్ధిదారులకు కూలి సొమ్ము చెల్లించాలన్నారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు వ్యక్తిగత మరుగుదొడ్లు ప్రతి ఇంటికీ ఉండాలన్నారు. నిర్మాణమైన గృహాలలో మరుగుదొడ్లు నిర్మించకుంటే అలాంటి వారికీ త్వరగా బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులకు ఇల్లు నిర్మించి ఇవ్వడానికి స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా ఇళ్లు నిర్మించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలు జరిగిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. లబ్ధిదారులను చైతన్యపరచడం, గృహాలు నిర్మించుకునేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-మద్దిపాడు

మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పంపిణీ చేశారు. ఇనమనమెల్లూరు గ్రామంలో బి.సుబ్బాయమ్మకి రూ.1,72,119 చెక్కును అందజేశారు. అనంతరం బీసీ కాలనీలో సిసి రోడ్లను పరిశీలించారు. నాగన్నపాలెం గ్రామంలో స్వయంపు నరసింహారావుకి రూ.1,24,685 చెక్కును అందజేశారు. పెద్దకొత్తపల్లి, గార్లపాడు, నెలటూరు, దొడ్డవరప్పాడు గ్రామాల్లోని పలువురికి చెక్కులను అందజేశారు. మొత్తం రూ. 9,29,311 చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మండవ జయంత్ బాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర్ల విజయ్,పోతినేని శ్రీనివాస రావు, గట్టినేని అయ్యన్న, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపి, రావిపాటి శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాసరావు, మార్నెని రాఘవ, మాజీ ఎంపిటీసీ మందపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌డిఎ పీడీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ–వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్‌గా టి.నారాయణ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం నాడు ప్రగతిభవన్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో కొద్దిసేపు భేటీ అయ్యారు. తొలుత ఆయన కలెక్టర్ తమీమ్‌అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డిఆర్‌డిఎ పీడీ

పకడ్బందీగా వారా బందీ అమలు చేయండి

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వారాబందీ విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా చెప్పారు. ఇరిగేషన్ అధికారులతో బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆమె ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా సరిహద్దు 85/3 మైలు వద్ద నుంచి వస్తున్న నాగార్జునసాగర్ నీటిని నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. వస్తున్న నీటిని పరిగణనలోకి తీసుకొని జిల్లాలో నీటి అవసరం ఉన్న ప్రాంతాలకు మళ్లించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ప్రాజెక్ట్ ఎస్ఈ నాగ మురళి, ఇరిగేషన్ ఈఈలు, డిఈఈలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం నాడు సిఐటియు కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసేందుకు యోచిస్తోందని, రద్దు చేస్తే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు పూర్తవుతున్నప్పటికీ మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. మున్సిపల్ కార్మికుల గత సమ్మె కాలపు జీవోలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులను ఆప్కాస్ స్థానంలో ఏజెన్సీలకు అప్పగించేందుకు యోచిస్తునదని, ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసే యోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కార్మికులు అనేక ప్రమాదాల గురవుతున్నారని, వారికి సెమీస్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని కోరారు. క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేని యెడల కార్మికులందరినీ సమీకరించి మరోసారి సమ్మెలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కె.సుబ్బారాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పోకల కోటేశ్వరరావు, కె.సామ్రాజ్యం, యు.కుమారి, కె.గోపి, టి.విజయమ్మ, పి.కోటేశ్వరరావు, ప్రసాద్, మురళి, నాగేశ్వరరావు, నరసింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొర్నెపాటి శ్రీనివాసరావు



రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కేశవర్ధన్‌రెడ్డి

పారదర్శకంగా రీసర్వే

ప్రజాశక్తి - హనుమంతునిపాడు

మండలంలోని వీరరామపురం గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వేను కనిగిరి ఆర్‌డిఒ కేశవర్ధన్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అగ్రిగోల్డ్ భూములు, దేవాదాయ భూములు, ప్రభుత్వ భూములు పారదర్శకంగా సర్వే చేయాలని చెప్పారు. ప్రతి రైతుకు నోటీసులు జారీ చేయాలని రైతుల సమక్షంలో సర్వే చేయాలని చెప్పారు. గ్రామంలో లేని రైతులను గుర్తించి సమాచారం అందజేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహశీల్దారు దిలీప్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రాజేంద్ర ప్రసాద్, మండల సర్వేయర్ రమణయ్య, గ్రామ సర్వేయర్లు పులి బ్రహ్మం, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఆల శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ ఎ కిరణ్‌కుమార్

విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలి

ప్రజాశక్తి - తాళ్లూరు

విద్యార్థుల మానసిక, శారీరిక అభివృద్ధికి తోడ్పడే విధంగా విద్యా బోధన చేయాలని డిఇఒ ఏ కిరణ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. పరీక్షలు బాగా రాయాలని వివరించారు. అంగన్‌వాడి కార్యకర్తల కోసం మూడు రోజుల శిక్షణలో భాగంగా జ్ఞానజ్యోతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనంలోనే మంచి అలవాట్లు నేర్పాలని కోరారు. ఆటలు, మాటలతో చిన్నారులను తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒ జి సుబ్బయ్య, ఎల్ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు శేషగిరి, డిఆర్పీలు శివరామిరెడ్డి, శ్రీమన్నారాయణ, చంద్రిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎస్‌వై జిల్లా అధికారి హేమలత

పరీక్షలకు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - దర్శి

పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో స్టడీ గంటలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారి హేమలత సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా పరీక్షల టైంలో స్టడీ గంటలు ఏర్పాటు చేసి విద్యార్థులను బాగా చదివించాలని ఎస్ఎస్‌వై జిల్లా అధికారి కేమలత సూచించారు. స్థానిక కెజిబివిలో దర్శి, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు మండలాలకు చెందిన కెజిబివి ప్రిన్సిపాల్స్‌తో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న పరీక్షల్లో విద్యార్థులను బాగా చదివించేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. పరీక్షల్లో విద్యార్థులకు భయం లేకుండా చదివే విధానంతో మార్కులు తెచ్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఎంఓ రూతు, ఐఆర్ టి నాగేంద్రం సలహాలు, సూచనలు చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - దర్శి

మహిళా చట్టాలపై ఎస్సీ, ఎస్టీ మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ ఎల్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై గుంటూరు నాగమణి అధ్యక్షతన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కృష్ణమూర్తి మాట్లాడుతూ మహిళలు స్వయం కృషితో ఆర్థిక అభివృద్ధి మెరుగు పర్చుకొనుటకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని అన్నారు. వాటిని వినియోగించుకోవాలని సూచించారు. బాల్యంలో ఆడబిడ్డలకు వివాహాలు చేయరాదని చెప్పారు. ప్రతి మహిళ చెల్లిగా, భార్యగా, బిడ్డగా ఎంతో ప్రాముఖ్యత సంచరించుకున్న మన దేశంలో ఆడపిల్లలను రక్షించుకునేందుకు నేటి చట్టాలు మీద ఆధారపడాల్సిన అవసరం ఉందని తెలుసుకోవాలని అన్నారు. డిబిఆర్‌సి మహిళా శిక్షణ రాష్ట్ర కోఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ స్త్రీల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో డిబిఆర్సి రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, మెప్మా మేనేజర్ రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ షాకీర్ భాష, పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన



వేరుశనగ రైతులతో మాట్లాడుతున్న తాళ్లూరు ఎఒ బి ప్రసాదరావు

ప్రజాశక్తి - తాళ్లూరు

వేరుశనగలో పొటాషియం తగ్గుదల వలన మొక్కల్లో అనారోగ్యం పెరిగి దృఢత్వం తగ్గుతుందని వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు అన్నారు. గ్రామంలో సాగు చేసిన వేరుశనగ పంటను ఆయన బుధవారం పరిశీలించారు. అందులో ఉన్న పొటాషియాన్ని గుర్తించి రైతులు, కూలీలకు వివరించారు. పొటాషియం తగ్గుదల లేకుండా పెంచుకునే విధంగా రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలని అన్నారు. పొటాషియం పెంచుకునేందుకు 10 గ్రాముల మ్యూరిడ్ ఆఫ్ పొటాషియంను లీటర్ నీటిలో కరిగించి 250 లీటర్ల ద్రావణంలో కలిపి పిచికారి చేయాలని అన్నారు. దీనితో వేరుశనగ పంట దృఢంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో విఎఎలు నాగరాజు నాయక్, వెంకట్రావు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలి



మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎసి పానకాలరావు

ప్రజాశక్తి - పొదిలి

మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ ఎం పానకాలరావు సూచించారు. స్థానిక శ్రీ పార్వతి సమేత నిర్మామహేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆయన బుధవారం సందర్శించారు. భక్తులకు సౌకర్యంగా దర్శనం కలిగేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఎండ వేడిని తట్టుకునేందుకు టెంట్లు, కింద మ్యాట్లు వేయాలని అన్నారు. దాతల సహకారంతో మంచినీటి వసతి కల్పించాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్‌బి, నగర పంచాయతీ, వైద్యశాఖ, ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. రథోత్సవం జరిగే 2వ రోజు ఏర్పాట్లు పరిశీలించారు. ఆర్ అండ్ బి, నగర పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకొని రహదారి పక్కన మట్టి కుప్పలు, రాళ్లు లేకుండా చూడాలని సూచించారు. రథోత్సవానికి వచ్చే భక్త జనాభాను అంచనా వేసుకొని పోలీసుల సహకారంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, పూజారులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో సూపర్నెంట్ జి శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జి సత్యనారాయణ, ఆలయ ఇఒ నర్రా నారాయణరెడ్డి ఉన్నారు.

బహుళ భాషలపై పట్టుతో సృజనాత్మకత



బాషా దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంఇఒ రాజాల కొండారెడ్డి

ప్రజాశక్తి - సిఎస్ పురం

విద్యార్థులు బహుళ భాషలపై పట్టు సాధించడం ద్వారా సృజనాత్మకత పెంపొందించుకునే అవకాశం ఉందని ఎంఇఒ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భాషా దినోత్సవ వేడుకలను ఉద్దేశించి ఆయన బుధవారం మాట్లాడారు. తెలుగు, హిందీ, ఆంగ్లంతో పాటు సంస్కృతం, ఉర్దూ, ఒరియా, తమిళం, కన్నడం వంటి భాషల పట్ల కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. భిన్న భాషల పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా దేశంలోని విభిన్న సంస్కృతుల పట్ల అవగాహన కలుగుతుందని అన్నారు. గణితం, సైన్సు, సాంఘిక శాస్త్రం వంటి అంశాలను అధ్యయనం చేయడంలో భాష మీద పట్టు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నాలుగు రోజులపాటు భాషా దినోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్య, డిజిటల్ లిటరసి, శాస్త్ర పరిశోధక అంశాల పట్ల అవగాహనకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. రెండో రోజు హిందీ భాష పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంచార్జి హెచ్ఎం లక్ష్మణరావు, సిఆర్పి సతీష్ కుమార్ పాల్గొన్నారు.



దృవీకరణ పత్రాలు అందజేస్తున్న హెచ్ఎం

దేశభక్తి గేయాల్లో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - దర్శి

దేశభక్తి గేయాల్లో జిల్లా మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురు ప్రసాద్ దృవీకరణ పత్రాలు బుధవారం అందజేశారు. జిల్లా స్థాయిలో బాలల మహోత్సవంలో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు దేశభక్తి గేయాల్లో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యార్థులు మొదటి స్థానం రావడం ఎంతో అభినందనీయమని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

వెలిగొండకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని నేడు ధర్నా

ప్రజాశక్తి సిఎస్ పురం

వెలిగొండ ప్రాజెక్టుకు తగినన్ని నిధులు ఇచ్చి వెంటనే పూర్తి చేసి ఈ ప్రాంత రైతాంగాన్ని, ప్రజల్ని ఆదుకోవాలని కోరుతూ ఈనెల 20న స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఏ వెంకటేశ్వరరెడ్డి, ఎం రత్నారెడ్డి తెలిపారు. రైతులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పామూరు : బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని కోరుతూ తహశీల్దారుకు నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.



దేవకి శ్రీనివాసులును సత్కరిస్తున్న ఎస్‌బిఎం ప్రసాదరావు

బీమా సఖితో మహిళలకు ఉపాధి

ప్రజాశక్తి - కనిగిరి

ప్రజల పెట్టుబడులకు నమ్మకమైన సంస్థ ఎల్ఐసి అని నెల్లూరు డివిజనల్ సీనియర్ మేనేజర్ బి ప్రసాదరావు అన్నారు. కనిగిరి శాటిలైట్ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఏజెంట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు పెట్టుబడులతో పాటు, పెన్షన్ వరకు అన్ని రకాల పాలసీలు జీవిత బీమా సంస్థలో ఉన్నాయని అన్నారు. క్లైంల పరిష్కారంలో దేశంలోనే ఎల్ఐసి అగ్రగామిగా ఉందన్నారు. కావున ప్రజలు ఎల్ఐసిలో పెట్టుబడులు పెట్టాలని, ప్రజలకు భీమ కల్పించాలని అన్నారు. నెల్లూరు డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్ ఓ కృష్ణమూర్తి మాట్లాడుతూ బీమా సఖి వలన మహిళలకు స్వయం ఉపాధి ఉంటుందని అన్నారు. ఎక్కువ మంది మహిళలు బీమా సఖి ద్వారా ఏజెన్సీ తీసుకోవాలని కోరారు. గతంలో కనిగిరి అగ్రస్థానంలో ఉండేదని ఇప్పుడు కూడా అదే అగ్రస్థానంలో నిలబెట్టాలని కోరారు. సభకు బ్రాంచ్ మేనేజర్ పిసిహెచ్‌వి సుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఎక్కువ మంది ఏజెంట్ల ద్వారా పాలసీలు చేయించిన 'లికా' దేవక శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. గత 50ఏళ్లుగా ఏజెంట్‌గా కొనసాగుతున్న ఎంఎస్ హరినారాయణ సన్మానించారు. కార్యక్రమంలో ఎఎఓ బి నాగరాజు, డెవలప్ మెంట్ అధికారులు ఎం శ్రీవర్దన్‌రెడ్డి, షేక్ షర్మిల, ఎల్ఐసి ఏజెంట్లు యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ సభ్యులు సిహెచ్ మాలకొండయ్య, డివిజన్ నాయకులు కె అనుక్, వై బ్రహ్మయ్య, సుబ్బరాయుడు, మీనిగ మధుసూదనరావు, వికె రావు, ఎవి రాజశేఖరరెడ్డి, ఎస్ కొండలరావు, మహేష్ పాల్గొన్నారు.

'విశిష్ట' సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - పర్చూరు

సొంత భూమి ఉన్న రైతులందరూ విశిష్ట సంఖ్యకోసం నమోదు చేసుకోవాలని ఎడిఎ మోహన్ రావు తెలిపారు. మండల పరిధిలోని అడుసుమల్లి, గొల్లపూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్య ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్, పట్టాదారు పాసపుస్తకం జరాక్స్ కాపీలు, ఆధార్ కు లింకైన మొబైల్ తీసుకుని రైతు సేవా కేంద్రాల దగ్గరకు వెళ్లి ఫార్మర్స్ ఐడి పొందవచ్చునని తెలిపారు. శనగ పంటలలో వచ్చే ఎండు తెలుగు నివారణకు పంట మార్పిడి తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. శనగ పంటకు బదులుగా మొక్కజొన్న, సజ్జ , జొన్న పైట్లు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఒ రామ్మోహనరెడ్డి, ఆదర్శ గ్రామ రైతులు, విఎఎలు ఆది లక్ష్మి, శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అమృతలూరులో మాట్లాడుతున్న ఎఒ

అద్దంకి : విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ధనరాజ్ అన్నారు. మండల పరిధిలోని కలవకూరు, సింగరకొండపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ మండలంలో పి ఎం కిసాన్ లబ్ధిదారులు 9,642 మంది ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 4,640 మంది లబ్ధిదారులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించినట్లుతెలిపారు. పిఎం కిసాన్ క్రింద లబ్ధి పొందని రైతులకు కూడా 1400 మందికి గుర్తింపు సంఖ్య కేటాయించినట్లు తెలిపారు. ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం సహాయ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకష్ణ , ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో మాట్లాడుతున్న ఎఒ మహేష్‌బాబు

చెరుకుపల్లి : రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఎఒ మహేష్ బాబు సూచించారు. మండల పరిధిలోని ఆరేపల్లి, తూర్పు పాలెం పంచాయతీ పరిధిలో బడేవారిపాలెంలో పొలం పిలుస్తోంది కారక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా క్షేత్ర సందర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులు సాగు చేసిన మినుము, పెసర పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. రైతులందరూ ప్రభుత్వ సూచనలను పాటించాలని, రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని తెలిపారు.

అమృతలూరు : మండల పరిధిలోని గోవాడ , ఎలవర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి మాట్లాడుతూ రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేయించుకోవాలన్నారు. పొలం ఉన్న ప్రతి ఒక్క రైతు వన్ బి, ఆధార్, ఆధార్ కి లింక్ చేసిన మొబైల్ నెంబరు తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవడం వల్ల పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ధాన్యం కొనుగోలు, రాయితీలు, ఇన్పుట్ సబ్సిడీ మొదలైనవి పొందటానికి విశిష్ట గుర్తింపు సంఖ్య ఉపయోగ పడుతుందన్నారు. ఈ ఈ కార్యక్రమంలో ఎఇఒ శ్రీకాంత్, విఎఎలు ప్రవళిక, సాయికుమార్ పాల్గొన్నారు.

కర్లపాలెం : రైతులందరూ తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఎఒ సుమంత్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని సమ్మెటవారిపాలెం, పెదగొల్లపాలెం గ్రామాలలో పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ విశిష్ట గుర్తింపు సంఖ్య ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు మరియు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షబానా, శివ నాగరాజు,రైతులు పాల్గొన్నారు.

కారంచేడు : విశిష్ట గుర్తింపు సంఖ్య వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఎఒ కె. సుధీర్ బాబు తెలిపారు. మండల పరిధిలోని అదిపూడి, ఎర్రంవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు శాంతి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండల పరిధిలోని మామిళ్ళపల్లి గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో నరసరావుపేటకు చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అమరలింగారెడ్డి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వందమంది వద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టట్ అమర లింగారెడ్డి మాట్లాడుతూ అవసరమైన వారికి త్వరలో కంటి ఆపరేషన్లు నిర్వహించి కళ్లఅద్దాలు అందజేస్తామని తలెఇపారు.ఈ కార్యక్రమంలో కంటి వైద్యశాల సిబ్బంది, గ్రామ నాయకులు దావులూరి శ్రీనివాసరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - నగరం

పిట్టలవారి పాలెంలోని కేర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ఇటీవల ఆర్ఒఎ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సిమ్స్ కాలర్ ఇంటిగ్రేయల్ గణితం విజ్ఞాన శాస్త్రం, హైదరాబాద్ సిసో,సిమో జాతీయస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో నగరం మండలం ఈదుపల్లి గ్రామంలో ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు విజయకేతనం ఎగరవేశారు రెండో తరగతి విద్యార్థిని ఎన్.రుత్విక ప్రథమ, ఒకటో తరగతి విద్యార్థిని ఎస్‌కె. ఫిదా ద్వితీయ, 6వ తరగతి విద్యార్థిని కె.మోహన విద్య తృతీయ, మూడవ తరగతి విద్యార్థిని ఎస్‌కె. ఫాతిమా తతీయ బహుమతిని సాధించారు. విజేతలకు నగదు బహు మతులు, పతకాలు అందజేశారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ యోనో బాబు, ప్రిన్సిపల్ నాగాంజనేయులు అభినందించారు.

పారిశుధ్య మెరుగుదలకు చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు

ప్రజాశక్తి- అమృతలూరు



మాట్లాడుతున్న డిపిఒ ప్రభాకర్‌రావు

గ్రామాల్లో పారిశుధ్య మెరుగుదల చర్యలు చేపట్టాలని డిపిఒ కెఎల్. ప్రభాకరరావు తెలిపారు. చెత్తాచెదారాన్ని గ్రామం వెలుపల రహదారి వెంబడి వేయడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ గ్రామాల్లోని చెత్తాచెదారం రహదారి వెంబడి వేయటం ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారిందన్నారు. గ్రామాలతో పాటు వెలుపల కూడా శుభ్రపరిచే విధంగా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. వేసవి దష్ట్యా గ్రామాలలో త్రాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 27న జరగనున్న గోవాడ తిరునాళ్లకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించి ఎక్కడ ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. తిరునాళ్ల సందర్భంగా చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాపర్ల నరేంద్రబాబు, ఎంపిడిఒ శేషమాంబ, డిఎల్‌పిఒ శ్రీనివాసన్, ఇఒపిఆర్‌డి రవిశంకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యుల

జీవనోపాధి పెంపుదలకు కృషి

ప్రజాశక్తి - పర్చూరు



మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ

గ్రామ సంఘంలోని స్వయం సహాయక సంఘ సభ్యుల జీవనోపాధి పెంపొందిం చడానికి విఒఎలు కృషి చేయాలని వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. పద్మ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకురాల (విఒఎలకు) శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రూపులోని స్వయం సహాయక సంఘ సభ్యులకు జీవనోపాదులు పెంపొం దించాలన్నారు. పాడి పరిశ్రమను అభివద్ధి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘం సభ్యులందిరి చేత పాడి గేదెలు కొనుగోలు చేయించాలని కోరారు. ఈ నెలలో చివరి లోపు మండలానికి 50 గేదెలు కొనుగోలు చేయాలన్నారు. అందు కోసం లబ్ధిదారులను గుర్తించాలన్నారు. స్త్రీ నిధి ద్వారా గాని బ్యాంకు లింకేజ్ ద్వారా గాని వారికి రుణ సౌకర్యం కల్పిం చాలన్నారు. పిఎంఎఫ్ఎంఇ ,పిఎంఇజిపి యూనిట్లు గురించి స్వయం సహాయక సంఘ సభ్యులకు తెలియజేసి కొత్త యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ ఎ.లక్షణాచారి, ఎపిఎం కె.రామకష్ణ , ఎఫ్‌పిఒ ఎపిఎం చిన్నయ్య, సిసి విజయకుమార్, పి . ప్రమీల, ఎం.శ్రీనివాస మూర్తి, నరసింహారావు , డిఎంజి శ్రీనివాసరావు, గ్రామ సంఘాల బుక్ కీపర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విక్టర్ విమ్మానియేల్

విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి- అద్దంకి

స్థానిక సింగరకొండ రోడ్డు లోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల అదాలత్ మరియు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిజెఆర్ఎఫ్ చైర్ పర్సన్ ఎన్.విక్టర్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకే అదాలత్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు 8 అర్జీలు అందజేసినట్లు తెలిపారు. వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్దంకి,పంగులూరు , కొరిశపాడు మండలాలకు చెందిన వినియోగదారులు, విద్యుత్ ఇఇ మస్తాన్‌రావు, ఎఇలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ పద్మావలి

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - నగరం

ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై నోడల్ ఆఫీసర్ పద్మావతి అధ్యక్షతన బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ బ్యాలెట్ పేపర్‌పై ఎలక్షన్ కమిషన్ వారు అందజేసిన పెన్నుతో ప్రాధాన్యత నంబరును వేయాలన్నారు. ఒకే ప్రాధాన్యత నంబరు ఇద్దరికి వేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరం, భట్టిప్రోలు, అమర్తలూరు తహాశీల్దార్లు నంచారయ్య,శ్రీనివాసరావు, నెహ్రూబాబు , నగరం ఎంపిడిఒ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, బిఎల్‌ఒలు, గ్రాడ్యుయేట్ ఓటర్లు తదిరతులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహాశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న జిలాని

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

చీరాల పట్టణంలో దేవాదాయ శాఖ కు సంబంధించిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని తెలిపారు. ఆక్రమణలకు గురైన దేవాదాయ శాఖకు సంబంధించిన గుర్తించి కాపాడాలని కోరుతూ డిప్యూటీ తహాశీల్దారు అర్జున్ కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జలానీ మాట్లాడుతూ చీరాల పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం వెనకవైపు ఉన్న దేవాలయ స్థలాన్ని కొందరు ఆక్రమించి రేకుల షెడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆక్రమణదారుడు ఆ స్థలాన్ని వేరొకరి అమ్మి సమీపంలోని స్థలాన్ని మళ్లీ ఆక్రమించినటు తెలిపారు. దేవాదాయ స్థలాల ఆక్రమణపై విచారణ జరిపి నిందితులను చర్యలు తీసుకోవాలని కోరారు.



లక్ష్మణరావును గెలిపించాలని కోరుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

పిడిఎఫ్ నేత లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి-రేపల్లె

ప్రజాగొంతుకగా ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కోర్టు వద్ద న్యాయవాదులను, వివిధ సంస్థల్లో పనిచేసే పట్టభద్రులను కలిసి ప్రచారం నిర్వహించారు. వివిధ సామాజిక, అభ్యుదయ ప్రముఖులను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ హక్కులు కాపాడుకోవాలంటే శాసనమండలి ప్రాధాన్యత నేపథ్యంలో పట్టభద్రులంతా పిడిఎఫ్‌కు అండగా ఉండాలన్నారు. శాసనమండలిలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల కోసం కేటాయించిన స్థానాల్లో వారికి ప్రాతినిధ్యం ఇవ్వటం ద్వారానే ప్రజల హక్కులు కాపాడబడతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా వస్తున్న ఆర్థిక, రాజకీయ సామాజిక మార్పుల్లో భాగంగా రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రభుత్వ విధానాల మీద చట్టసభల్లో గట్టిగా మాట్లాడలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి తరుణంలో శాసనమండలిలో ప్రజల వాణి వినిపించే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మోపిదేవి శ్రీనివాసరావు, జై భీమ్ ఇన్‌ఛార్జి రమేష్ రాంజీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, సామాజిక, అభ్యుదయ సంఘాల నాయకులు దారం సాంబశివరావు, మునిపల్లి సుబ్బయ్య, కోన శ్రీను తదితరులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు తెలపాని కోరారు. కార్యక్రమంలో సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్. మణిలాల్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వై.నవీన్, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ వై.కిషోర్, డివై ఎఫ్ఐ, సిఐటియు నాయకులు బిఎల్‌కె. ప్రసాద్, కె. వెంకట్, కె.ఆశీర్వాదం, కె.రమేష్, డి.ఆగస్టీన్, లక్ష్మణరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ప్రచారం

భట్టిప్రోలు: ప్రజాసమస్యలను వినిపించే పెద్దల సభకు ప్రజానాయకుడు కెఎస్. లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించాలని సిఐటియు మండల కార్యదర్శి జి. సుధాకర్ కోరారు. లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. లక్ష్మణరావుకు కార్మిక, కర్షక, రైతు, నిరుద్యోగ, ఉపాధ్యాయ సంఘాల మద్దతు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.సత్యనారాయణ, కౌలు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

త్వరలో అందరి లెక్కలు తేలుస్తాం..

- ఐదేళ్ల వైసిపి పాలనలో అన్నదాతకు కన్నీరే..
- ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ గుంటూరు మిర్చి యార్డ్ వద్ద జగన్ డ్రామాలు
- రెడ్ బుక్‌ను తలుచుకుంటే వైసిపి శ్రేణుల్లో వణుకు
- రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, డిబివి స్వామి వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మద్యం పాలసీలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టగానే ఫైళ్ళు దగ్ధం అవడం వెనుక ఎవరెవరు ఉన్నారో రాష్ట్ర ప్రజలందరికి తెలుసన్నారు. త్వరలోనే అందరి లెక్కలు తేలుస్తామని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ జల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం ఒంగోలు వచ్చిన ఆయన నగరంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఐదేళ్ళ వైసిపి పాలనలో ప్రజలు నరకం చూశారని, భరించలేక రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. జగన్‌రెడ్డికి బుద్ధి వచ్చేలా 11 సీట్లకే పరిమితం చేశారని, అధికారం కోల్పోయినా జగన్‌లో అహం తగ్గలేదని మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో అన్నదాతలు ఎన్నో అవస్థలు పడ్డారని, వేల సంఖ్యలో రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం అన్నదాతల వద్దకు వెళ్లి జగన్ మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా గుంటూరు మిర్చి యార్డ్ వద్దకు వచ్చి జగన్ హంగామా సృష్టించారన్నారు. జగన్ ఆడే డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరన్నారు. జైలులో ఉన్న ముద్దాయి వల్లభనేని వంశీ పరామర్శకు వెళ్లి నోటికి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన టిడిపి కార్యాలయాన్ని ధ్వంసం చేసిన కేసులో అన్ని ఆధారాలతోనే వంశీని అరెస్ట్ చేసిన సంగతి గుర్తు పెట్టుకోవాలన్నారు. చట్టం ఎదుట అందరూ సమానులే. రెడ్ బుక్‌ను తలుచుకుంటే వైసిపి నేతలకు నిద్ర కూడా పట్టడం లేదన్నారు. గత ఐదేళ్లల్లో చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఇష్టానుసారంగా వ్యవహరించిన ప్రతీ ఒక్కరిని చట్టం ముందు దోషులుగా నిలబెడతామన్నారు. మద్యం స్కాంపై సిఐడి విచారణ జరుగుతుందని, త్వరలోనే అసలు దొంగలు బయటకు వస్తారని తెలిపారు.

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ దళిత, రైతు ద్రోహి జగన్ రెడ్డి అని మండిపడ్డారు. జగన్ చేసిన ఐదేళ్ల పాపాలకు కూటమి ప్రభుత్వం ప్రాయశ్చిత్తం అనుభవిస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులను నట్టేట ముంచిన జగన్ నేడు అన్నదాతల వద్దకు వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. జగన్ భాష మార్చుకోవాలని, ప్రజలు తిరస్కరించినా తన వైఖరి మార్చుకోవడం లేదన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి గుంటూరు మిర్చి యార్డ్‌కి వెళ్లి జగన్ హంగామా సృష్టించారని, కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. ఎన్ని డ్రామాలు, నాటకాలు ఆడినా రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని మంత్రి స్వామి స్పష్టం చేశారు. సమావేశంలో ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు, మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మావతి

బాలల సంరక్షణకు

సమన్వయంతో పనిచేయాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాజ్యాంగ వ్యవస్థలో ఉన్న అన్ని చట్టాలను సమర్థవంతంగా అమలు చేసి బాలల సంరక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి పద్మావతి సూచించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు జిల్లాలో బాలల సంరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాల పురోగతిపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో కమిషన్ సభ్యురాలు పద్మావతి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ జిల్లాలో అన్ని వ్యవస్థలు కూడా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల అపహరణ, బాలికలపై అత్యాచారాలు వంటి అమానవీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బాలల సంరక్షణ కేంద్రాలు, బాలసదన్, శిశు గృహలో ఉంటున్న అనాథ చిన్నారులను వారి తల్లిదండ్రుల చెంతకు చేరే ప్రయత్నాలు చేస్తున్నామని, తల్లిదండ్రుల ఆచూకీ దొరకకపోతే నిబంధనల మేరకు దత్తత ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశం లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమంపై దృష్టి

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సంక్షేమానికి అధికారులు దృష్టి పెట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి పద్మావతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లో సంక్షేమ శాఖ మరియు వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్సీ సంక్షేమ అధికారి లక్ష్మణ్ నాయక్ నరసింహస్వామి , ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారి అంజలి, డిసేబుల్ వెల్ఫేర్ ఏడీ అర్చన, డిస్ట్రిక్ ప్రొబేషన్ ఆఫీసర్ బాల ప్రభాకర్, ఒంగోలు టూటౌన్ సిఐ శ్రీనివాసరావు, మహిళా పోలీస్‌స్టేషన్ సిఐ సుధాకర్‌రావు మరియు వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

మర్రిపూడిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య

ప్రజాశక్తి - మర్రిపూడి

మర్రిపూడి మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల అభివృద్ధిపై నాయకులు, కార్యకర్తలు, అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా రహదారులు, మంచి నీరు, డ్రైనేజ్ వంటి మౌలిక సదుపాయాల ఏర్పాటుపై నివేదికలు తీసుకున్నారు. కొండపి నియోజకవర్గంలో భాగమైన మర్రిపూడి మొదటి నుంచి తెలుగుదేశంకు, తమ కుటుంబానికి ఎంతో అండగా ఉందన్నారు. మాజీ మంత్రి, తమ తాత దామచర్ల ఆంజనేయులు, ఎమ్మెల్యేగా డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చేసిన అభివృద్ధిని గుర్తు చేశారు. గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవన్నారు. ఈ ఐదేళ్లలో అన్ని విధాలా అభివృద్ధి చేసి టీడీపీ, తమ కుటుంబంపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటామని అన్నారు. నూతనంగా నిర్మిస్తున్న బెంగళూరు, విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేలో రాకపోకలు కొనసాగించే విధంగా ఇక్కడ మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు సంబంధిత జాతీయ రహదారుల అధికారులతో మాట్లాడి కృషి చేస్తున్నాన్నారు. మర్రిపూడిలో గతంలో ఒక దేవదాయ శాఖ అధికారి నిర్లక్ష్యంతో భూములను చుక్కల జాబితాలో చేర్చడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచి పోయిందన్నారు. ఈ విషయాన్ని సిసిఎల్ఎతో చర్చించామని తెలిపారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. సాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఫ్లోరిన్ సమస్యతో ఇబ్బంది పడుతున్న గ్రామాల్లో ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. మర్రిపూడి కొండ మీద ఉన్న శ్రీ పుట్టులగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీతో చర్చించామని అన్నారు. ఈ పాటికే కొండ వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తయిందని కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణం చేపట్టవలసి ఉందన్నారు. దీని కోసం మంత్రి ఆనం రామ నారాయణరెడ్డితో మాట్లాడి ఘాట్ రోడ్ మంజూరు చేస్తామన్నారు. మండలంలో ఒక చెక్‌డ్యాంతో పాటు కొన్ని వాటర్ షెడ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అధ్వానంగా ఉన్న మర్రిపూడి, పొదిలి రోడ్డు విషయంపై జిల్లాపరిషత్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. త్వరలో ఈ రహదారి నిర్మాణం పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.



దామచర్ల సత్యను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

మరో ఏడాదిలో పోర్టు అందుబాటులోకి..

ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, గత ఐదేళ్లలో గాడి తప్పిన రాష్ట్ర అభివృద్ధిని తిరిగి దారిలో పెట్టేందుకు సిఎం చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య అన్నారు. స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మరో ఏడాదిలో రామాయపట్నం పోర్ట్ అందుబాటులోకి రానుందని తెలి పారు. మూలా పేట పోర్టు 40 శాతం, బందర్ పోర్టు 30 శాతం పూర్తయిందని అన్నారు. ఐదు షిప్పింగ్ హార్బర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలి పారు. గువ్వలదిన్నె, రేపల్లె వద్ద రెండు షిప్పింగ్ హార్బర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఓడరేవులు, షిప్పింగ్ హార్బర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అధికారిక హోదాలో తొలిసారి వచ్చిన సత్యాను తెలుగుదేశం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షులు చేరెడ్డి నరసారెడ్డి, రేగుల వీరనారాయణ, మాజీ జెడ్పిటిసి తుళ్లూరు వెంకట నరసింహం, మాజీ ఎంపిపి దాసరి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపిపి గొంటు హనుమారెడ్డి, మలసాని నాగేశ్వరరావు, గురజాల రాజేష్, చిలకల కొండారెడ్డి, కిలారి ఆంజనేయులు, ముత్తుముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.